# కనకాంబరాలు

శ్రీ గ్రిద్దలూరు గోపాలరావుగారు

"పూలో.. పూలో"
పన్నీరులు—గన్నేరులు
చామంతులు—పూబంతులు
బొడ్డుమల్లెలు—గడ్డసంపెగ
సన్నజాజులు—విరజాజులు
కనకాంబర—గేదంగులు
ఎన్నో ఎన్నో ..
రంగు రంగుల
పూలో—పూలో—

పూలబుట్ట చేతబట్టాడు కొన్ని పూలదండలు చేతిమీద వేసు కున్నాడు.. గాలిలో గిర్రున తిరుగుతూ వేలాడు తున్నాయి పూల దండలు—వీధి పొలి మేరున తొలి కేక వేశాడు పూలతాత...పూల పరిమళంలో తాత నడిచి వస్తు న్నాడు వీధివెంట...

యిదే ప్రథమ పర్యాయం ఆ వూరిలో పూలమ్మవచ్చాడు తాత...వీధి కొనవరకూ వెళ్ళాడు...ఒక్కరూ పిలిచి కానీ పూలుగూడా కొనలేదు...తాత నిరుత్సాహపడి పోయాడు. మరల ముదిమిగొంతు ఎత్తి అరిచాడు బిగ్గరగా ..

'పూలో, పూలో'—

'ఓ పూలో! యిలారా'—ఒక లేత కంఠం ఎంతో మృదువుగా పిలిచింది..

పూల తాత ఆగి తలపైకెత్తి చూచాడు...

అతని ముడుతలుబడ్డ ముఖంలో ఎందుకో అంత ఉత్సాహం రేకెత్తింది ..ఆకస్మికంగా ఎందుకో ముదిమి పెదిమలపై ముసిముసి నవ్వు తొలికింది ..

ఆ మిద్దె మొదటి అంతస్థులో యినుప చువ్వలు లేని కిటికీ తలుపులు తెరచుకొని ఓ లేత లేమ; పదు మూడేండ్ల వయస్సుంటుంది ..యిప్పుడిప్పుడే యవ్వనం ఆమెలోచొచ్చుకుంటూవుంది—పూల తాతను పిలిచింది...ఆమె అలా ఆ కిటికీలోనుంచి తొంగి చూస్తూవుంటే—నీల వర్ణపు ఆకాశంలో, నల్లని మేఘచ్ఛాయను తొలగించుకొని తొంగి చూస్తూవున్న తెల్లని పూర్ణ చంద్ర బింబంలా కాన్పిస్తూ, హృదయాన్ని ఆహ్లాద పరుస్తూవుంది...

తాత చూస్తూనే వున్నాడు...

'పూలో, అలా తిరిగి లోపలికిరా'—అన్నది మరల ఆలేత నూనూగు కిన్నర కంఠము..

పూల తాత దర్వాజా తలుపులు తెరచుకొని లోపలికి వచ్చాడు.. ఆ అమ్మాయి ఎదురైంది...

"ఏ పూవ్వులు కావాలమ్మా—తాత సంతోషంగాఅడిగాడు ..అతనికి ఆమెను చూస్తే ఎందుకో అంత సంతోషము ?

"కనకాంబరాలున్నాయా తాతా"—తాత చేతి మీద వ్రేలాడుతూన్న దండలను కదలిస్తూ అంది...

తాత విస్తుగా, ఆత్రుతతో ఆ అమ్మాయి ముఖంలోకి చూస్తూ నిలుచున్నాడు...జవాబు చెప్పలేదు...

'ఏమిటి తాతా అలాగే చూస్తున్నావు'—

తాత ఉలిక్కి పడ్డాడు ..

'ఏమీ లేదమ్మా!...నీ వైపు చూస్తూ వుంటే యింకా చూడాలనిపిస్తూనే వుంది ..బ్రహ్మ అందమైన వస్తువుల్లో సౌందర్యాన్నంతా నీకే యిచ్చాడు...నీవెంతో అదృష్ట వంతురాలవమ్మా..

అదీగాక నిన్ను చూస్తూవుంటే పదిహేను సంవత్సరాల నాడు చచ్చి పోయిన నా చిట్టి మనుమరాలు జ్ఞప్తికి వస్తూ వుంది . నా మనుమరాలే యిక్కడ పుట్టిందా అనిపిస్తూ వుంది...అంతా అలాగే వున్నావు...నీకంటె ఆ అమ్మాయి కొంచము నలుపు ..అంతే'—

ఆ అమ్మాయి నూనూగు సిగ్గుతో, చిరునవ్వుతో తల్లి ముఖంలోకి చూచింది .